# ఆదివాసీల మన్ననలు పొందిన ఐఏఎస్ రాహుల్

- 'ఆదివాసి వికాసరత్న' బిరుదుతో ఘన సత్కారం



**భద్రాచలం, ఏప్రిల్ 11, ప్రజాజ్యోతి:** గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ గిరిజనుల మనసులు గెలుచుకున్న భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్‌కు ఆదివాసీలు ఘన సత్కారం నిర్వహించారు. ఆదివాసి జేఏసీ ఆధ్వర్యంలో ఆయనకు 'ఆదివాసి వికాసరత్న' బిరుదును ప్రదానం చేశారు. భద్రాచలంలో శుక్రవారం నిర్వహించిన గిరిజన ఇలవేల్పుల చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మంత్రి సీతక్క, పలువురు ఎమ్మెల్యేల సమక్షంలో రాహుల్

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 12 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 6




# గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం గర్వకారణం

## జిల్లా కలెక్టర్ అంకిత్

- సమన్వయంతోనే రాష్ట్ర స్థాయి అవార్డులు వైద్య సిబ్బందికి కలెక్టర్ అభినందనలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 11, ప్రజా జ్యోతి :**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాల సందర్భంగా జిల్లా వైద్య విధానం పరిషత్ ఆసుపత్రుల సిబ్బందికి ప్రశంస పత్రాల ప్రదానోత్సవాన్ని శనివారం పాల్వంచ పెద్దమ్మ గుడి సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై, వైద్య సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేసి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంగా ఉన్న జిల్లాలో నాణ్యమైన వైద్య సేవలు అందించడం సవాలుతో కూడుకున్నదైనా, వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని తెలిపారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాలు అధికంగా

మిగతా 2 లో...

# భద్రగిరి మార్ట్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

- గిరిజన మహిళల ఆర్థిక సాధికారతకు ఆదర్శంగా ప్రశంసలు




**భద్రాచలం, ఏప్రిల్ 11, ప్రజాజ్యోతి:** గిరిజన మహిళలు, రైతులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రారంభించిన భద్రగిరి మార్ట్‌కు జాతీయ స్థాయిలో ప్రశంసలు లభిస్తున్నాయి. ఈ మార్ట్‌లో అందుబాటులో ఉన్న సేంద్రియ, పోషకాహార నిత్యావసర ఉత్పత్తులను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ డైరెక్టర్ వమాలి దికాను సన్మానించి ఉత్పత్తులను అందజేసినట్లు ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని డీఎస్సెస్ భవనంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ

మిగతా 2 లో...

# రోడ్డు ప్రమాదాల నివారణకు ఆరు రోజుల ప్రత్యేక కార్యక్రమాలు

- ప్రజలందరూ భాగస్వాములు కావాలి: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 11 , ప్రజాజ్యోతి:** రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 నుండి 18వ తేదీ వరకు జిల్లాలో ఆరు రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో

మిగతా 2 లో...




# ధర్నా చౌక్‌పై అధికారుల చూపు ఎప్పుడు..?

- నిరసనకు వచ్చిన ప్రజలకు అవస్థలు
- ధర్నా చౌక్ దుస్థితి... ఇంకా ఎంతకాలం..?
- కూనంనేనిపైనే ప్రజల ఆశలు

**కొత్తగూడెం, ఏప్రిల్ 11 ( ప్రజాజ్యోతి )** ప్రజాస్వామ్యంలో సామాన్య ప్రజల గళం వినిపించే వేదికగా ఉండాల్సిన ధర్నా చౌక్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యానికి గురై దయనీయ స్థితికి చేరుకుంది. అధికారుల నిర్లక్ష్యం, గత పాలకుల వైఫల్యం కలిసి ఈ వేదికను పూర్తిగా నిరుపయోగంగా మార్చేశాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో ప్రత్యేకంగా కేటాయించిన ధర్నా చౌక్ స్థలం సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో మూలనపడిన పరిస్థితి నెలకొంది. ప్రజల సమస్యలు చెప్పుకునే ఈ ప్రదేశం ఇప్పుడు ప్రమాదకర స్థితికి చేరడం ఆందోళన కలిగిస్తోంది. విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ మధ్యలోనే ధర్నా చౌక్ ఉండటంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చి చెట్లు, రాళ్లు, చెత్తతో నిండిపోయిన ఈ ప్రదేశంలో నిలబడటమే కష్టంగా మారింది. నిరసన తెలిపేందుకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ తమ ఆవేదనను వ్యక్తం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇది ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన వేదికేనా..? లేక ప్రజలను ఇబ్బందులకు

మిగతా 2 లో...

## రోడ్డు ప్రమాదాల నివారణకు ఆరు రోజుల ప్రత్యేక కార్యక్రమాలు

(మొదటి పేజీ తరువాయి...)

ఆయన ఈ వివరాలు వెల్లడించారు. రోడ్డు భద్రతా నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు ఇతర శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణ చర్యలు చేపడుతున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ప్రజలు, వాహనదారులు చురుకుగా పాల్గొనాలని కోరారు. స్వీయ నిర్లక్ష్యంతో ప్రతి సంవత్సరం అనేక మంది తమ ప్రాణాలను కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్ వినియోగం, సీటుబెల్ట్ ధరించడం, రక్షణాత్మక డ్రైవింగ్ వంటి నియమాలను పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఉన్నా లేకపోయినా ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించే పౌర బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, వేగంగా డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ ఉపయోగించడం, తప్పు దారిలో ప్రయాణించడం, సిగ్నల్ ఉల్లంఘించడం, అధిక లోడుతో వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. రెండవ రోజు అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి మరమ్మత్తులు చేపడతారు. మూడవ రోజు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. నాలుగవ రోజు ఆటో డ్రైవర్లకు శిక్షణ, తనిఖీలు చేపడతారు. ఐదవ రోజు ప్రమాదాల సమయంలో ఇవ్వాల్సిన ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తారు. ఆరవ రోజు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రజలు, యువత, వాహనదారులు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## భద్రగిరి మార్ట్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి...)

అధికారులతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో భద్రాచలం ఐటీడీఏ తరపున పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు. గిరిజన కుటుంబాల అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలుపై ఈ సమావేశంలో చర్చలు జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు, గిరిజన రైతులు స్థాపించిన సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల్లో తయారుచేసిన మిల్లెట్ బిస్కెట్లు, ఇప్పపువ్వు లడ్డూలు, వివిధ రకాల పచ్చళ్లు, తృణధాన్యాలు, గిరిజన రైతుల ఉత్పత్తులు, అటవీ ఉత్పత్తులతో పాటు భద్రగిరి మార్ట్‌కు సంబంధించిన వివరాలను డైరెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వమాలి దిక మాట్లాడుతూ, అడవుల్లో నివసించే గిరిజన మహిళలు, రైతులు మార్కెట్ సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో భద్రాచలంలో భద్రగిరి మార్ట్ ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. మధ్య దళారుల ప్రమేయం లేకుండా గిరిజనుల ఉత్పత్తులను కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా బలాన్ని కల్పిస్తున్న ఐటీడీఏ పీవో బి. రాహుల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఇతర ఐటీడీఏలలో కూడా ఇలాంటి మార్ట్‌లను ఏర్పాటు చేసి గిరిజనుల వ్యవసాయ, అటవీ ఉత్పత్తులకు మార్కెట్ కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధర్నా చౌక్‌పై అధికారుల చూపు ఎప్పుడు..?

(మొదటి పేజీ తరువాయి...)



గురిచేసే ప్రదేశమా..? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయినా కూడా తమ సమస్యల పరిష్కారం కోసం బాధిత ప్రజలు ఇదే ధర్నా చౌక్‌ను ఆశ్రయించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం షెడ్, త్రాగునీటి సదుపాయం, కూర్చునే సౌకర్యం వంటి మౌలిక వసతులు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో ధర్నా చౌక్ అభివృద్ధిపై ప్రశ్నలు మరింతగా పెరుగుతున్నాయి.

**కూనంనేనిపైనే ప్రజల ఆశలు**

ధర్నా చౌక్ అభివృద్ధికై గత పాలకులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన హక్కు వినియోగించే స్థలానికే ఇలాంటి నిర్లక్ష్యం తగదని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగూడెం నియోజకవర్గం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుపై ప్రజలు భారీ ఆశలు పెట్టుకున్నారు. కార్మిక నేతగా ప్రజల సమస్యలపై పోరాడిన అనుభవం ఉన్న ఆయన ఈ సమస్యను పరిష్కరించగలరని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ధర్నా చౌక్‌ను తక్షణమే అభివృద్ధి చేసి షెడ్, త్రాగునీటి సదుపాయం, కూర్చునే బల్లలు, విద్యుత్ భద్రత, పరిశుభ్రత వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానికులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

# గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం గర్వకారణం





(మొదటి పేజీ తరువాయి...)

ఉన్న ఈ జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా ఆరోగ్య స్థితిని మెరుగుపరచడంలో వైద్య శాఖ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. గతంలో మారుమూల గ్రామాలకు సరైన రహదారులు, కమ్యూనికేషన్ సదుపాయాలు లేకపోవడంతో వైద్య సేవలందించడంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని ఆయన గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి రావడంతో చర్ల, గుండాల వంటి దూర ప్రాంతాల్లో కూడా అత్యాధునిక వైద్య సేవలు అందించడం సాధ్యమైందన్నారు. టెలిమెడిసిన్, డిజిటల్ కనెక్టివిటీ, మొబైల్ వైద్య సేవల ద్వారా ప్రజలకు సమయానికి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ విజయానికి ఆశా కార్యకర్తల నుంచి ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, వైద్యులు, జిల్లా స్థాయి అధికారులు వరకు అందరి సమన్వయం ప్రధాన కారణమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించడం వల్లే జిల్లాకు రాష్ట్ర స్థాయిలో అవార్డులు లభించాయని, ఇది జిల్లాకు గర్వకారణమని అన్నారు. వైద్య శాఖ ఇదే ఉత్సాహంతో ముందుకు సాగి, రాబోయే రోజుల్లో రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ స్థాయిలో కూడా అగ్రస్థానంలో నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు ప్రతి పల్లె, ప్రతి గిరిజన ప్రాంతానికి ఆరోగ్య సేవలు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత సంవత్సరంలో సాధించిన విజయాలను కొనసాగిస్తూ, వచ్చే సంవత్సరం కూడా మరిన్ని ప్రతిష్ఠాత్మక అవార్డులు జిల్లాకు తీసుకురావాలని వైద్య సిబ్బందిని ప్రోత్సహించారు. సేవా భావంతో పనిచేసే వైద్య సిబ్బంది వల్లే ప్రజల నమ్మకం పెరుగుతుందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం అత్యంత ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ రవిబాబు, తహసీల్దార్ దారా ప్రసాద్, ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యులు, నర్సులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆదివాసీల మన్ననలు పొందిన ఐఏఎస్ రాహుల్

(మొదటి పేజీ తరువాయి...)

ఈ బిరుదును స్వీకరించారు. గిరిజన ప్రాంతాల్లో నివసించే ఆదివాసీల సమస్యలను తనవిగా భావించి క్షేత్ర స్థాయిలో కృషి చేసిన ఆయన సేవలు అభినందనీయమని ఆదివాసి జేఏసీ నేతలు పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా విస్తరణ, ఆధునిక వైద్య సేవల అందుబాటు, వ్యవసాయ అభివృద్ధి వంటి రంగాల్లో రాహుల్ చూపిన చొరవ ప్రశంసనీయం అని మంత్రి సీతక్కతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణలో ఆయన రక్షణ కవచంలా నిలిచారని అభిప్రాయపడ్డారు. భద్రాచలం ఐటిడిఏ పరిధిలో రాహుల్ పరిపాలనలో గిరిజన ప్రాంతాలు అభివృద్ధి బాటలో ముందుకు సాగుతున్నాయి. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యతనిస్తూ గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. భద్రాచలంలో ఏర్పాటు చేసిన గిరిజన మ్యూజియం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రాష్ట్ర స్థాయి ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. ఇటీవల గిరిజన మార్ట్ ఏర్పాటు చేసి అటవీ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ముఖ్యంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించారు. గిరిజన ఇలవేల్పులపై ప్రత్యేక పుస్తకాన్ని తీసుకువచ్చి వారి చరిత్రను భవిష్యత్ తరాలకు అందిస్తున్నారు. విద్యా రంగంలో కూడా విశేష కృషి చేస్తూ విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలు, ల్యాప్‌టాప్‌లు అందజేయడం, పాఠశాలలను సందర్శిస్తూ మార్గదర్శకంగా నిలవడం వంటి చర్యలు తీసుకుంటున్నారు. కోయ భాషలో మాట్లాడడం ద్వారా గిరిజనులతో మరింత సాన్నిహిత్యం పెంచుకున్నారు. గిరిజనుల అభ్యున్నతికి కృషి చేసిన రాహుల్ సేవలను గుర్తిస్తూ ఆదివాసీలు ప్రేమతో 'ఆదివాసి వికాసరత్న' బిరుదును ప్రదానం చేయడం విశేషం.




## విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి



**ఆళ్ళపల్లి. ఏప్రిల్ 11. ప్రజాజ్యోతి** ఆళ్ళపల్లి మండలం మర్కోడు గ్రామంలో విద్యుత్ ఘాతానికి గురై ఓ పాడి గేదె మృత్యువాత పడింది. బాధితుడు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...మర్కోడు గ్రామానికి చెందిన ముప్పిడి వెంకటేశ్వర్లు తన పాడి గేదెను మేతకు వెళ్ళి తిరిగి ఇంటికి వస్తుండగా దారిలో ప్రమాదవశాత్తు విద్యుత్ స్టే వైర్ కి గేదె తగలడంతో అక్కడికక్కడే షాక్‌కు గురై మరణించింది. మరణించిన గేదె సూడితో (గర్భంతో) ఉందని, దాని విలువ సుమారు ₹75,000 నుండి ₹80,000 వరకు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు.పాడి గేదెను కోల్పోయిన తనను, ప్రభుత్వం.విద్యుత్ అధికారులు ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.

## భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారున్ని అభినందించిన క్రీడామంత్రి వాకిటి శ్రీహరి



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 11, ప్రజాజ్యోతి,** భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ పవర్ లిఫ్టింగ్ నేషనల్ గోల్డ్ మెడలిస్ట్ డివి శంకర్రావుని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శాలువాతో సత్కరించి ఘనంగా అభినంsదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 73 సంవత్సరాల వయసులో గుండెకి బైపాస్ సర్జరీని సైతం లెక్కచేయకుండా జాతీయ స్థాయిలో బంగారు పథకాలు సాధించినటువంటి డివి శంకర్రావుని అభినందించడమే కాకుండా త్వరలో అంతర్జాతీయ పోటీలలో కూడా రాణించి పేరు తేవాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బోగాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ జివి రామిరెడ్డి, జిల్లా కోశాధికారి, మహంతి వెంకటకృష్ణాజి పాల్గొన్నారు

# సామాజిక సమానత్వానికి మార్గదర్శి మహాత్మ జ్యోతిరావు పూలే

- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 11,(ప్రజా జ్యోతి)** సామాజిక సమానత్వం, విద్యా వ్యాప్తి కోసం జీవితాంతం కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే దేశానికి మార్గదర్శకుడిగా నిలిచారని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు . శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అంకిత్, మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సమాజంలో



సమానత్వం, న్యాయం నెలకొల్పడంలో జ్యోతిరావు పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.మహిళా విద్యకు ప్రాధాన్యతనిస్తూ, ముందుగా తన భార్యకు విద్య అందించి, మహిళల సాధికారతకు పునాది వేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసి, వారికి సామాజిక న్యాయం అందించేందుకు కొత్త దారులు చూపిన గొప్ప సంస్కర్తగా ఆయన నిలిచారని.జాతి, వర్ణ వివక్షలను వ్యతిరేకిస్తూ సమాన హక్కుల సమాజాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో పనిచేసిన పూలే ఆలోచనలు ఈనాటికీ ఎంతో ప్రాసంగికమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, బీసీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి దినేష్ ఎ.డి. మైన్స్, ఉపేందర్ ఇ.డి ఎస్.సి. కార్పొరేషన్, జి. శ్రీనివాస్ జిల్లా ఆడిట్ అధికారి డ సుదీర్ కుమార్ పంచాయితీరాజ్ శాఖ,జిల్లా అధికారులు, బి సి సంఘ నాయకులు కొదుమూరు సత్యనారణ బొర్రా జయమ్మ గుమలాపురం సత్యనారణ జి. కృష్ణ గారు, ఇంద్రాల మురళి, వారాధి సత్యనారాయణ , బండి రాజుగౌడ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే జీవితం ఎందరికో ఆదర్శం



**కొత్తగూడెం, ఏప్రిల్ 11 (ప్రజాజ్యోతి):**అణగారిన వర్గాలకు అక్షరజ్యోతిలా మారిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయం వద్ద పూలే 199వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామేష్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని పూలే విశ్వసించారని తెలిపారు. అక్షరాలను ఆయుధంగా చేసుకుని అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి అపూర్వమని కొనియాడారు. సమసమాజ స్థాపన కోసం పూలే చేసిన పోరాటాలు, చూపిన కార్యదీక్షత నేటికీ ఎందరికో ఆదర్శమని పేర్కొన్నారు. సంఘ సంస్కరణల దిశగా పూలే ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారని చెప్పారు. తన సహచరురాలు సావిత్రిబాయి పూలేకు విద్యాబుద్ధులు నేర్పించి ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. పూలే దంపతులు 54 విద్యాలయాలను స్థాపించి విద్యా విస్తరణకు కృషి చేశారని వివరించారు. మహిళల హక్కులు, విద్యా బోధన, సతీ సహగమనానికి వ్యతిరేకంగా పోరాడి స్త్రీలకు పునర్వివాహాలను ప్రోత్సహించిన మహనీయుడు పూలే అని కొనియాడారు. నేటి యువత ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్, కొండా విజయ్ భాస్కర్, శంకర్ పాల్గొన్నారు.

# పూలే ఆశయ సాధనే ఎస్ఎఫ్ఐ లక్ష్యం

- కార్పొరేట్ విద్యకు వ్యతిరేకంగా పోరాడాలి: ఎస్ఎఫ్ఐ టౌన్ కార్యదర్శి రవీందర్



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 11 ప్రజాజ్యోతి,** మహనీయ సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే ఆశయాలే దిశగా, విద్యార్థి లోకం పోరాటాలకు సిద్ధం కావాలని భారత విద్యార్థి ఫెడరేషన్ భద్రాచలం టౌన్ కార్యదర్శి కొప్పుల రవీందర్ పిలుపునిచ్చారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పూలే 199వ జయంతి వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. పూలే కేవలం ఒక వ్యక్తి కాదు, ఒక గొప్ప విప్లవ ఆలోచనా ధోరణి అని కొనియాడారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, మహిళా విద్య కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. దేశంలో అణగారిన వర్గాలకు విద్యను చేరువ చేయడంలో ఆయన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు.నేటి పాలకులు పూలే ఆశయాలకు విరుద్ధంగా విద్యావ్యవస్థను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆయన విమర్శించారు. పెరుగుతున్న ఫీజులు, విచ్చలవిడి ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమానత్వ సమాజ నిర్మాణం కోసం, విద్యారంగంలో జరుగుతున్న అన్యాయాలపై ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటం చేస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, సురేష్, రఘు, ప్రకాష్, సాయి, సుభాష్, అరుణ్, పుష్ప కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా బేతంపూడి ఉర్సు వేడుకలు

- బేతంపూడి ఉర్సు వేడుకలు తరలి వస్తున్న భక్తులు



**టేకులపల్లి,ఏప్రిల్ 11,ప్రజా జ్యోతి:**మండలంలోని బేతంపూడి హజరత్ సయ్య ద్ జమాలుద్దీన్ బిహారీ బాబా దర్గా ఉర్సు వేడుకలు శుక్రవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉర్సు కమిటీ ఆధ్వర్యంలో దర్గా ఆవరణ మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే కాకుండా ఏపీ నుంచి కూడా భక్తులు ప్రత్యేక వాహనాల్లో తండోపతండాలుగా విచ్చేసి దర్గాలో దర్శనాలు చేసుకుని ముక్కులు చెల్లించుకున్నారు. రాత్రి 8 గంటలకు కొత్తగూడెంలోని సూపర్ బజార్ చెందిన సి.మాలిక్ నివాసం నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి,దర్గాలో సమర్పించారు.ఢిల్లీకి చెందిన ప్రముఖ కళాకారుడు నుస్రత్ ఆలీ జహంకార్ ఖవ్వాలి కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం లో అవాంఛనీయ ఘటన జరగకుండా సీఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐలు రాజేందర్. శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు.

# గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం గర్వకారణం

- జిల్లా కలెక్టర్ అంకిత్
- సమన్వయంతోనే జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డులు
- వైద్య శాఖకు జిల్లా కలెక్టర్ అభినందనలు

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 11,(ప్రజా జ్యోతి)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా వైద్య విధానం పరిషత్ ఆసుపత్రుల సిబ్బందికి ప్రశంస పత్రాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శనివారం పాల్వంచ పెద్దమ్మ గుడి సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై, వైద్య సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేసి, వారి సేవలను ప్రశంసించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంగా ఉన్న జిల్లాలో నాణ్యమైన వైద్య సేవలను అందించడం ఎంతో సవాలుతో కూడుకున్నదైనా, జిల్లా వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని అన్నారు మారుమూల ఏజెన్సీ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న ఈ జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడం ద్వారా ప్రజల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడంలో వైద్య శాఖ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు .గతంలో మారుమూల గ్రామాలకు సరైన రహదారి, కమ్యూనికేషన్ సదుపాయాలు లేకపోవడం వల్ల వైద్య సేవలను సమర్థవంతంగా అందించడంలో అనేక సమస్యలు ఎదురయ్యాయని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి రావడంతో చర్ల, గుండాల వంటి దూర ప్రాంతాల్లో కూడా అత్యాధునిక వైద్య సేవలను అందించడం సాధ్యమైందని తెలిపారు. టెలీమెడిసిన్, డిజిటల్ కనెక్టివిటీ, మొబైల్ వైద్య సేవల ద్వారా ప్రజలకు సమయానికి చికిత్స అందించడం సాధ్యమవుతోందని అన్నారు, ఈ విజయానికి ఆశా కార్యకర్తల నుండి ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, వైద్యులు, జిల్లా స్థాయి అధికారులు వరకు అందరి సమన్వయం ముఖ్య కారణమని కలెక్టర్ అన్నారు . ప్రతి ఒక్కరు తమ తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడం వల్లనే జిల్లాకు రాష్ట్ర స్థాయిలో అత్యున్నత అవార్డులు లభించాయని తెలిపారు. ఇది జిల్లాకు గర్వకారణమని అన్నారు.జిల్లా వైద్య శాఖ ఇదే ఉత్సాహంతో ముందుకు సాగి, రాబోయే రోజుల్లో రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ స్థాయిలో కూడా అగ్రస్థానంలో నిలిచేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు, ప్రతి పల్లె, ప్రతి గిరిజన ప్రాంతానికి ఆరోగ్య సేవలు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు .ప్రస్తుత సంవత్సరంలో సాధించిన విజయాలను కొనసాగిస్తూ, వచ్చే సంవత్సరం కూడా మరిన్ని ప్రతిష్టాత్మక అవార్డులు జిల్లాకు తీసుకురావాలని వైద్య సిబ్బందిని ప్రోత్సహించారు. సేవా భావంతో పనిచేసే వైద్య సిబ్బంది వల్లే ప్రజల నమ్మకం పెరుగుతుందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం అత్యంత ముఖ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో డిసిహెచ్ రవి బాబు, తాసిల్దార్ దారా ప్రసాద్, ఆసుపత్రుల సూపర్డెంట్లు, వైద్యులు, నర్సులు, సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కల్యాణలక్ష్మి, షాధీముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 11 (ప్రజా జ్యోతి):**బూర్గంపహాడ్ మండలంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన కల్యాణలక్ష్మి, షాధీముబారక్ చెక్కుల పంపిణీలో పాల్గొని లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. తొలుత బూర్గంపహాడ్ లోని రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం స్కూల్ యాజమాన్యం పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అదేవిధంగా బూర్గంపహాడ్ పంచాయతీ గౌతాపురంలో తల్లపురెడ్డి నాగేశ్వరి, నీరుడు రమణ లబ్దిదారుల ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్నారు.ఎంపీడీవో జమలారెడ్డి, తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్, పంచాయతీరాజ్ డీఈ పొదెం వెంకటేశ్వర్లు, ఏఈ చారి, డీటీ సమ్మయ్య, మాజీ సొసైటీ అధ్యక్షులు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ మందా నాగరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, నాయకులు భజన సతీష్, ప్రసాద్, కైపు శ్రీనివాసరెడ్డి, దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, చిప్పా రాజు, ఇంగువ రమేష్, గుద్దేటి ప్రవీణ్, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చల్లా వెంకటరమణ, బర్ల నాగమణి, ఎడమకంటి సుధాకర్రెడ్డి పాల్గొన్నారు.

# పురుగుమందు తాగి వ్యక్తి మృతి



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 11 (ప్రజా జ్యోతి):**కుటుంబ కలహాలతో వ్యక్తి పురుగుమందు తాగి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని మణుగూరు క్రాస్ రోడ్డు సమీపంలోని సందెళ్ల రామాపురంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్సై నాగభిక్షం తెలిపిన వివరాల ప్రకారం... పాల్వంచ మండలం దంతెలబోరు గ్రామానికి చెందిన నూనె వినయ్ కుమార్(25) కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపం చెంది శుక్రవారం రాత్రి మణుగూరు క్రాస్ రోడ్డులోని సందెళ్ల రామాపురం సమీపంలో పురుగుమందు తాగి మృతిచెందాడు. మృతుని తల్లి నూనె వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సామాజిక విప్లవకారుడు పూలే

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా




**చుంచుపల్లి, ఏప్రిల్ ( ప్రజాజ్యోతి )** మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో సామాజిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పూలే 199వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. సమాజంలో అసమానతలను తొలగించేందుకు చదువే ప్రధాన మార్గమని నమ్మిన మహనీయుడు పూలే అని పేర్కొన్నారు. మహిళా విద్య, సామాజిక సమానత్వం కోసం ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. పూలే జీవితం నేటి తరానికి మార్గదర్శిగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సామాజిక, ప్రజా సంఘాల నాయకులు వంగ వెంకట్, బొమ్మెర శ్రీనివాస్, చందర్ రావు, లింగేశ్ తదితరులు పాల్గొన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో కూడా పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య మాట్లాడుతూ కుల వివక్ష లేని సమాజ నిర్మాణానికి పూలే చేసిన కృషిని కొనియాడారు. ఆయన ఆలోచనలను గ్రామగ్రామాన తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు భూక్యా శ్రీనివాస్, ఎస్.వి. రమణమూర్తి, నేరెళ్ల రమేష్, నాయకులు పి. సత్యనారాయణాచారి, గుగులోత్ నగేష్, నదీమ్, సోమయ్య, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

## సాదా బైనమా దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 11,(ప్రజా జ్యోతి )** జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదా బైనమా,భూభారతి దరఖాస్తులు, ఎస్ఐఆర్ మ్యాపింగ్ ,ఇతర భూ సమస్యలపై జిల్లా కలెక్టర్ శనివారం తాసిల్దారులు, సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సడలించిన నిబంధనల ఆధారంగా పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సంబంధిత దరఖాస్తులపై వెంటనే నోటీసులు జారీ చేసి, వేగవంతమైన చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని తాసిల్దారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను తాసిల్దారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువులోగా అన్ని భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలని స్పష్టం చేశారు.ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, డిలీషన్ ప్రక్రియను కచ్చితంగా నిబంధనలకు అనుగుణంగా మాత్రమే చేపట్టాలని సూచించారు. మరణించిన వ్యక్తుల పేర్ల తొలగింపు విషయంలో నోటీసులు జారీ చేసి, సరైన ధ్రువీకరణ అనంతరం మాత్రమే చర్యలు తీసుకోవాలని అన్నారు . ఈ ప్రక్రియలో బిఎల్వోలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని ఆదేశించారు.జిల్లాలో ఉన్న పాల్వంచ, దమ్మపేట, కరకగూడెం తదితర మండలాల్లో ఉన్న అటవీ, రెవెన్యూ , ఇతర భూ సమస్యలకు సంబంధించిన సమగ్ర నివేదికలను వెంటనే సిద్ధం చేసి రేపటిలోగా సమర్పించాలని తాసిల్దారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# వ్యసన బాధితులకు సమగ్ర చికిత్స, పునరావాస సేవలు అవసరం

- : జిల్లా కలెక్టర్ అంకిత్





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 11 , ప్రజా జ్యోతి:** వ్యసన బాధితులకు సమగ్ర చికిత్స, పునరావాస సేవలు అందించేందుకు కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అడిక్షన్ కౌన్సిలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వ్యసన బాధితులకు సమగ్ర చికిత్సతో పాటు పునరావాస సేవలు అందించడం ఎంతో అవసరమని తెలిపారు.అనంతరం అదే ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వ్యసన చికిత్స కేంద్రాన్ని కూడా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా మత్తు వ్యసనానికి గురైన వారికి ప్రత్యేక వైద్య చికిత్సలు, నిపుణుల పర్యవేక్షణలో పునరావాస సేవలు, నిరంతర కౌన్సిలింగ్ అందించబడతాయని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మద్యం వ్యసనంతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చిన రోగితో మాట్లాడి, అతని రోజువారీ ఆదాయం, మద్యం పై ఖర్చు వంటి వివరాలు తెలుసుకున్నారు. తాను మద్యం మానేందుకు పలు మార్లు ప్రయత్నించినప్పటికీ, వణుకుడు, ఫిట్స్ వంటి సమస్యలు రావడంతో చికిత్స కోసం ఈ కేంద్రానికి వచ్చానని రోగి తెలిపాడు. ఈ తరహా కేసులకు అందిస్తున్న వైద్య సేవలు, కౌన్సిలింగ్ విధానం, చికిత్స ప్రక్రియపై కలెక్టర్ అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులు పూర్తిగా కోలుకునేలా సమగ్ర చికిత్సతో పాటు నిరంతర కౌన్సిలింగ్ అందించాలని వైద్యులకు సూచించారు.ఇదే సందర్భంగా మత్తు పదార్థాల నియంత్రణ దినోత్సవం కార్యక్రమం కింద నిర్వహించిన క్విజ్, వ్యాస రచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి కలెక్టర్ ప్రశంస పత్రాలు, షీల్డులను అందజేశారు. యువతలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.మత్తు వ్యసన నిర్మూలనలో ప్రభుత్వ శాఖలు, వైద్య విభాగం, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు బాధితులను ప్రోత్సహించి, ఈ కేంద్రం సేవలను వినియోగించుకునేలా సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ రమేష్, డాక్టర్ రాధిక, డాక్టర్ రాధామోహన్, ఇతర వైద్యులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కెఓసిలో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**టేకులపల్లి,ఏప్రిల్11,ప్రజాజ్యోతి :** సామాజిక ఉద్యమ మార్గదర్శి, బహుజన చైతన్య దీప్తి,వివక్షలపై పోరాడి, మహిళా విద్యకు విశేష కృషి చేసిన సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని మండలంలోని కెఓసిలో మేనేజర్ పేరాల శ్రీనివాస్,గుర్తింపు సంఘం బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు ల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.అనంతరం వారు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనం కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహౌన్నత వ్యక్తి బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని వారు అన్నారు.పూలే ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిదని అన్నారు.సమాజంలో అసమానతలు తొలగించడంలో ఆయన చూపిన మార్గం ఎంతో ప్రాముఖ్యమైందని వారు అన్నారు. విద్యా రంగంలో సమాన అవకాశాలు కల్పించాలనే ఆలోచనలు నేటికీ ప్రస్తుతానికి వేనని చెప్పారు. యువత ఆయన భావజాలాన్ని అనుసరించి సమాజం అభివృద్ధికి కృషి చేయడానికి సిద్ధంగా ఉండాలి అని వారన్నారు.పూలే దళితులు, బలహీన వర్గాల కోసం చేసిన సేవలను వారు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భూక్య నాగేశ్వరరావు,ప్రాజెక్టు ఇంజినీర్ చెన్నయ్య,రక్షణ అధికారి ఉండం బ్రహ్మం, వేంకటనర్సయ్య, రామకృష్ణ చారి, అజ్మీరా రామకృష్ణ, రాజేష్,భయ్యా వరప్రసాద్, రామస్వామి, రాము, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం పై ఉద్యమం

**చర్ల, ఏప్రిల్ 11:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం పెద్ద మిడిసిలేరు గ్రామ పంచాయతీ సర్పంచ్ బెండబోయిన సుహాసిని ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ వార్డు మెంబర్ లు గ్రామ ప్రజలు అందరు ఐక్యమత్యంగా ఒకే తాటిపై నిలబడి మద్యం నిషేధ గ్రామంగా తయారు చేయాలని గత వారం రోజుల నుంచి ఉద్యమం చేస్తున్నారు. శనివారం పెద్ద మిడిసిలేరు గ్రామంలో గ్రామ పెద్దలు సర్పంచ్ లు అధికారుల గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలో మద్యపానము నిషేధించాని తీర్మానం చేసారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుహాసిని మాట్లా డుతూ మా గిరిజన గ్రామాల్లో గుడుంబ మద్యం ఇతర మత్తు పదార్థాలు అమ్ముట వలన యువకులు మత్తు మందులకు బానిసై జీవితాలను ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారు అని ఆడవాళ్ల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి అని ఎన్నోసంవత్సరాలుగా బాధలు పడుతున్నారు అని అన్నారు .మా గిరిజనుల అమాయకత్వాన్ని వాడుకొని డబ్బులు సంపాదిస్తున్నారు అని వారి జీవితాలను నాశనం చేస్తున్నారు అని మా పంచాయతీలో ఎక్కడైన మందు అమ్మితే మీ షాపులు ఉండవు అని మన గిరిజన పిల్లలను మనమే పాడు చేసుకుంటున్నాము అని ఇకనైనా మేలుకొని మన జీవితాలు మనమే బాగు చేసుకోవాలి అని తెలియజేసారు. ఈ సంవత్సరం మహిళ సర్పంచ్ లను ఎన్నుకోవడం వలన ఆడవాళ్లు పడే బాధ వారికి తెలియడం వలన పంచాయతీలలో మద్యం పై ఉద్యమాలు చేపడుతున్నారు .పెద్ద మిసిలేరు సర్పంచ్ సుహాసిని నిర్ణయానికి ప్రజలందరు అభినందనలు తెలియచేసారు.ఈ సమావేశానికి శ్యామల రామారావు, తిప్పాపురం సర్పంచ్ సునీత ,అధికారులు పాల్గొన్నారు.




## యువత మత్తుకు దూరంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో డా. తుకారాం రాథోడ్

**కొత్తగూడెం, ఏప్రిల్ 11 ( ప్రజాజ్యోతి )** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అనుసరించాలని జిల్లా వైద్యశాఖ అధికారి డా. తుకారాం రాథోడ్ పిలుపునిచ్చారు. ఆరోగ్య వారం కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మత్తు పదార్థాల నియంత్రణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కొత్తగూడెంలో నిర్వహించిన డ్రగ్ అవగాహన ర్యాలీలో పాల్గొని ప్రజలకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలను వివరించారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు లోనుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల నియంత్రణలో కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, యువజన సంఘాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజం మొత్తం బాధ్యతగా తీసుకుంటేనే ఈ సమస్యను సమర్థంగా అరికట్టవచ్చని చెప్పారు. జిల్లాలో మత్తు పదార్థాల వినియోగాన్ని తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. సాయి కళ్యాణ్, ప్రోగ్రాం ఆఫీసర్ ( సి.హెచ్.ఐ ) డా. ప్రతాప్, ఇతర వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# యుద్ధంతో జీవన ప్రమాణాలు చిన్నాభిన్నం

- అలుముకుంటున్న అశాంతి వాతావరణం
- ప్రపంచాన్ని గుప్పెట్లో పెట్టుకునేందుకే ట్రంప్ ఎత్తుగడలు
- శాంతిని నెలకొల్పేందుకు యువత ముందుకు రావాలి
- ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే ప్రభాకర్ రావు




**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 11,(ప్రజా జ్యోతి)**
పశ్చిమాసియా దేశాల యుద్ధ వాతావరణం కారణంగా మానవ జీవన ప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయని ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే ప్రభాకర్ రావు అందోళన వ్యక్తం చేశారు. శనివారం పాల్వంచలోని సాయితేజ ఫంక్షన్ హాల్లో ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో ఆపరేషన్ ఫ్రెడ్జిప్ (ఇస్కఫ్) (భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం) జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు ,ఈ సభకు ముఖ్యాతిధిగా హాజరైన ప్రభాకర్ రావు మాట్లాడుతూ యుద్ధాలు అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అస్థిరత వల్ల సాధారణ ప్రజల జీవన స్థితిగతులపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. దీని కారణంగా అశాంతి వాతావరణ పరిస్థితులు అలుముకుంటున్నాయని, ఇంధన ధరలు పెరిగాయని,నిత్యవసరాల కొరత, ఉపాధి అవకాశాలు తగ్గుముఖం పడుతున్నాయని అన్నారు, పశ్చిమాసియా ఘర్షణలతో ప్రపంచ వాణిజ్య మార్గాలు, ప్రధానంగా ఇంధన సరఫరా మార్గాలు దెబ్బతిన్నాయని, దీని ప్రభావం భారత దేశంపై స్పష్టంగా పడుతోందన్నారు. ప్రపంచాన్ని గుప్పెట్లో పెట్టుకునేందుకు అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ ఎత్తుగడలు వేస్తున్నారని, అమెరికా స్వార్ధ పూరిత వైఖరి ప్రపంచ శాంతికి ముప్పుగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెనుజుల అధ్యక్షులు, ఆయన సతీమణిని ట్రంప్ బందించడం ఎంతవరకు సరైందని అన్నారు. టెహ్రాన్లో ఇజ్రాయేల్, అమెరికా సంయుక్తగా వైమానిక దాడిచేసి ఖామేనిని హతమార్చారని, అనేక మంది చిన్నారులు కూడా బలై పోయారని చెప్పారు. దేశ ప్రధాని మోడి యుద్ధంపై నోరు మెదపకపోవడం సరైంది కాదని, ఆయన తీరు ప్రజల్లో తీవ్ర ఆందోళనను కలిగిస్తోందన్నారు. దేశప్రధానిగా మోడి శాంతి దౌత్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం సరైన ప్రకటనలు చేసి శాంతి చర్చలకు కృషి చేస్తూ దేశ ప్రజలకు కూడా భరోసా కల్పించాలని తెలిపారు. కానీ భారత తొలి ప్రధాని నెహ్రూ ప్రపంచ శాంతికి పాటుపడ్డారని, అంతర్జాతీయ శాంతికి కృషి చేశారని అన్నారు ,యుద్ధం కారణంగా దేశంలో అలుముకుంటున్న పరిస్థితులు, దేశ ప్రయోజనాలు, ప్రజల జీవన ప్రమాణాలు పరిరక్షణ ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం అన్నారు. ప్రపంచశాంతి, మానవతా విలువల పరిరక్షణ కోసం అన్ని దేశాలు యుద్ధ రాజకీయాలకు స్వస్తి చెప్పి సంభాషణల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని ఇస్కాఫ్ కోరుతుందనితెలిపారు. శాంతి యుత వాతవరణ పరిరక్షణకు భిన్న సంస్కృతుల సమ్మేళమైన భారత దేశంలోని ప్రజలను శాంతియుత స్థితిగతుల వైపుకు నడిపించేందుకు ఇస్కాఫ్ పనిచేస్తుందని, దీనిని మరింత బలోపేతం చేసి ముందుకు తీసుకెళ్లేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ శాంతిచర్చల ద్వారా ఏ సమస్య అయినా పరిష్కారమవుతుందని, దేశ ప్రధాని ఆయా దేశాల మధ్య శాంతి చర్చలు జరిగేలా కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుర్రం వెంకటేశ్వర్లు, గౌతమి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డా. సూర్యదేవర రామ్మోహన్ రావు, తాండ్ర రమణా రావు, కేఎల్ఆర్ అధినేత నాగమణి, కాలువ దేవదాసు, వేముల కొండలరావు తో పాటు కార్పొరేటర్లు, వై ద్యులు, లాయర్లు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే 198వ జయంతి



**చర్ల, ఏప్రిల్ 11:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం బీ ఎస్ రామయ్య భవన్ లో జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు, పూలే చిత్రపటానికి మచ్చ వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రమ దోపిడి ,కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించిన గొప్ప నాయకుడని సమాజంలో ఒక వర్గం మరొక వర్గాన్ని దోచుకోవడాన్ని వ్యతిరేకించారు అని అన్నారు.పూలే కేవలం ఆధ్యాత్మిక సంస్కర్త మాత్రమే కాదు అని ఆయన ఒక రైతు పక్షపాతి అని అప్పటి జమీందారీ భూస్వామ్య వ్యవస్థలో రైతులు పడుతున్న ఇబ్బందులను, వడ్డీ వ్యాపారుల దోపిడీని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు అని అన్నారు. పూలే భారత దేశంలో లోని కుల,వర్గ సమస్యల పై పోరాటాలను అదేవిధంగా విద్యా విప్లవం – చైతన్యానికి మార్గమని పూలే నమ్మారన్నారు, అణగారిన వర్గాలకు మహిళలకు విద్యను దూరం చేయడం అనేది వారిని బానిసలుగా ఉంచడానికి పాలక వర్గాలు చేసిన కుట్రగా ఆయన భావించారు అని విద్యావంతులైన శ్రామిక వర్గం మాత్రమే విప్లవం తీసుకురాగలదని ఆయన విశ్వసించారన్నారు అని పూలే స్ఫూర్తితో యువత ఉద్యమించాలన్నారు.1873లో ఆయన స్థాపించిన సత్యశోధక్ సమాజ్ అణచివేతకు గురవుతున్న వారందరినీ ఒకే వేదికపైకి తెచ్చిందన్నారు. ఇది మతపరమైన ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ, మానవులందరూ సమానమే అనే సూత్రాన్ని ప్రచారం చేసింది అని దళిత, బహుజన వెనుకబడిన వర్గాల ఏకీకరణ ద్వారా సామాజిక మార్పును ఆశించడం అనేది వర్గ పోరాట స్ఫూర్తికి ప్రతిరూపమని తెలిపారు. మహిళా విముక్తి సమానత్వం లింగ వివక్షను కూడా పూలే ఒక రకమైన అణచివేతగానే చూశారన్నారు. స్త్రీలు విద్య నేర్చుకోవడం ద్వారానే తమ హక్కుల గురించి పోరాడగలరని నమ్మి, తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారు. పితృస్వామ్య వ్యవస్థను విమర్శించడం ద్వారా ఆయన ఆధునిక సామాజిక న్యాయ పోరాటాలకు పునాది వేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐటీయు జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మచారి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ నాయకులు మచ్చ రామారావు,తోటమల్ల రమణమూర్తి,ఎడెల్లి గణపతి, మచ్చ వీరభద్రం,కొంగూరు రమణ,కొంగూరు సత్యం,తోటమల్ల విజయ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బి.నవీన్,బందెల చంటి, దొడ్డి హరి నాగవర్మ,ఐద్వా మండల కార్యదర్శి పొడుపుగంటి సమ్మక్క, గణేష్ ఆటో యూనియన్ అద్యక్షులు పామర్ బాలాజీ,వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు షారోని, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకురాలు వరదల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విద్యా విప్లవ కర్త పూలే జయంతి వేడుకలు

- సమానత్వం కోసం పూలే చూపిన మార్గాన్ని అనుసరించాలి
- ఎంఈఓ ఆనంద్ కుమార్





**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 11, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలలో మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జన్మదినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ షేక్ బురాన్, అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి ఆనంద్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే జీవిత చరిత్ర, విద్యా రంగానికి చేసిన సేవలు, సమాజంలో సమానత్వం కోసం చేసిన పోరాటాన్ని వివరించారు. కులవివక్ష, అబలలపై దురాచారాలకు వ్యతిరేకంగా ఆయన జీవితాంతం పోరాడిన మహానుభావుడని తెలిపారు. పూలే చూపిన మార్గాన్ని ప్రతి విద్యార్థి అనుసరించాలని సూ చించారు.కళాశాల ప్రిన్సిపాల్ షేక్ బురాన్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన ఆలోచనలు, సేవలను గుర్తు చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు పూలే ఆశయాలను ఆచరించాలని విద్యార్థులకు సూచించారు.మహాత్మ జ్యోతిరావు పూలే సత్యశోధక సమాజాన్ని స్థాపించి అణగారిన వర్గాలకు దిక్సూచి చూపారని, స్త్రీ విద్యకు పునాది వేసి మహిళల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. రైతుల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏటీపీ శ్రీకాంత్, డిప్యూటీ వార్డెన్ మధు, అధ్యాపక బృందం, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకెయంఎస్) డిమాండ్






**టేకులపల్లి,ఏప్రిల్ 11,ప్రజాజ్యోతి:** ఆరుగాలం కష్టపడి పెంచుకున్న మొక్కజొన్న ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయిందని అఖిలభారత రైతు కూలి సంఘం (ఏఐకెయంఎస్) జిల్లా నాయకులు భూక్య హర్జ, భూక్య నర్సింగ్ ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ అన్నారు. మండలంలోని పెట్రాంచలక స్టేజికి చెందిన భూక్యరామ్యకు చెందిన రెండు ఎకరాలు భూక్య కుమార్ కు చెందిన నాలుగు ఎకరాలు,ఇద్దరు రైతులా మొక్కజొన్న ఆరు ఎకరాలు ప్రమాదవశాత్తు కాలిపోయిందని అని వారు తెలిపారు.అ పంటకు వ్యవసాయ శాఖ అధికారులు సంబంధిత అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి పంట నష్ట పరిహారం చెల్లించాలని ఎలాంటి షరతులు లేకుండా మార్కు ఫైడ్ ద్వారా మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని వారు అన్నారు.పంట చేతికి వచ్చే సమయాన పంట ఖాళీ బూడిద కావడంతో ఆ రైతుల అర్ధనాదాలు వర్ణ అతితమని వారన్నారు.ఆ రైతులను ప్రభుత్వం ఆదుకొవాలి అని వారు అన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం రైతుల పక్షాన ఉన్నదని భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో స్వామి, పన్నాలాల్,రమేష్,శ్రీను,కిసన్, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి



**ఇల్లందు, ఏప్రిల్ 11, ప్రజాజ్యోతి:** మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఇల్లందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి అధ్యక్షుడు భూక్యా రవి కుమార్ నాయక్ తో పాటు బార్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సత్యశోధక్ సమాజ్ (1873) స్థాపన, కుల వివక్ష, అంటరానితనం, మహిళా విద్య, వితంతువుల పునర్వివాహం కోసం పూజ చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే ఆదర్శాలు న్యాయమైన, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం దిశగా తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## పాత టెండర్ విధానాన్నే కొనసాగించాలి

- - సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు కీలక పాత్ర పోషిస్తున్నారు
- - టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఆర్.మధుసూదన్ రెడ్డి



**మణుగూరు, ఏప్రిల్ 11, (ప్రజాజ్యోతి):** సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకంలో నూతన టెండర్ విధానాన్ని రద్దుచేసి పాత టెండర్ విధానాన్నే కొనసాగించాలని టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. శనివారం ఏరియా ఎస్ఓటు జి.యం బి. శ్రీనివాస చారికి టీయుసిఐ అనుబంధ ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మణుగూరు బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా సుమారు 1200 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తూ సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వీరంతా సింగరేణి భూ నిర్వాసితులు, ఓసి ప్రభావిత గ్రామాలలోని నిరుద్యోగ యువకులు, పదవీ విరమణ పొందిన సింగరేణి కార్మికుల వారసులే అని తెలిపారు. సింగరేణిలో అవుట్ సోర్సింగ్ ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు యాజమాన్యం ద్వారా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా నియమించబడి చాలీ చాలని జీతాలతో జీవనం కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి చట్టబద్ధమైన హక్కులు, సౌకర్యాలు అందనప్పటికీ సంస్థ అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని అభిప్రాయపడ్డారు. యాజమాన్యం ప్రవేశపెట్టిన ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నూతన టెండర్ విధానం వల్ల ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు నష్టకరంగా ఉందని అన్నారు. కాబట్టి నూతన టెండర్ విధానాన్ని రద్దుచేసి, పాత టెండర్ విధానాన్నే కొనసాగించేలా సవరణ చేసి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. నూతన టెండర్ విధానం రద్దు కోసం ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులంతా ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.సంజీవరెడ్డి, సతీష్, సుధాకర్, జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావుపూలే 199వ జయంతి వేడుకలు




**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 11, ప్రజాజ్యోతి,** భద్రాచలంలోని శనివారం టిఎన్జీవోస్ అధ్యక్షులు డెక్క నరసింహారావు, ప్రధాన కార్యదర్శి గగ్గూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జ్యోతిరాజు పూలే 199వ జయంతిని పురస్కరించుకొని వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతిరాజ్ పూలే మహారాష్ట్రకు చెందిన ప్రముఖ భారతీయ సంఘ సంస్కర్త, ఆలోచనాపరుడు, విద్యావేత్తని, కుల వివక్షకు, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడి, మహిళా విద్య, దళితుల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తని కొనియాడారు. అతని భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి 1848లో పూణేలో బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించడంత పాటు స్త్రీ విద్యకు ఎంతో ప్రోత్సాహాన్ని అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గాంధీ సందీప్, వెంకన్న నాగేశ్వరరావు, రామచందర్ పాల్గొన్నారు.

# ఆంధ్రాలో కలిసిన ఐదు పంచాయతీలను భద్రాచలంలో కలపాలి

- ఈ నెల 13వ తేదీన జరగబోవు మహాసభను జయప్రదం చేయండి
- గోడ ప్రతులు ఆవిష్కరణలో జేఏసీ చైర్మన్ అమర్నేని రామారావు, కన్వీనర్ వెంకట పుల్లయ్య



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 11, ప్రజా జ్యోతి,** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 13న భద్రాచలంలో ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని ఏర్పాటు చేసే బహిరంగ సభను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ అమర్నేని రామారావు, కన్వీనర్ వెంకట పుల్లయ్యలు పేర్కొన్నారు. సోమవారం జరిగే మహాసభకు సంబంధించిన గోడ ప్రతులను శనివారం భద్రాచలం హరిత టూరిజం నందు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభకు మేధావులు, మహానుభావులు, విద్యావేత్తలు, విద్యార్థి సంఘ నాయకులు అన్ని కుల సంఘాలు, గిరిజన ఆదివాసి సంఘ నాయకులు, రాజకీయ నాయకులు పుర ప్రముఖులతో పాటు ఐదు గ్రామ పంచాయతీ సర్పంచులు హాజరవుతున్నారన్నారు. అదేవిధంగా అక్కడి ప్రజలు, ఉద్యోగస్తులు అందరు ఇదే ఆహ్వానంగా భావించి పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఎస్ ప్రెసిడెంట్ డెక్క నరసింహారావు, కార్యదర్శి బాలకృష్ణ, గెజిటెడ్ అసోసియేషన్ సభ్యులు కామేశ్వరరావు, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ చల్లగుల్ల నాగేశ్వరరావు, ఎల్ఐసి శ్రీనివాస్ మూర్తి గాంధీ, డాక్టర్ కాంతారావు, ఐదు గ్రామపంచాయతీ సభ్యులు నక్క వెంకన్న, సత్యం వార్డు మెంబర్లు అశోక్ శాంతారావు జగన్మోహన్రావు దత్తాత్రేయ రఘు పాల్గొన్నారు.

# ఐదు గ్రామ పంచాయతీల విలీనంపై ముందడుగు

- రేపు భద్రాచలంలో భారీ బహిరంగ సభ
- సభ విజయవంతానికి కృషి చేస్తున్న టీఎన్జీవో నాయకులు డెక్క నరసింహారావు, బాలకృష్ణ





**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 11, ప్రజా జ్యోతి** భద్రాచలం మండలం నుంచి ఏపీలో కలిసిన యటపాక, గుండాల, పిచుకలపాడు, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలను తిరిగి భద్రాచలం మండలంలో కలిపేందుకు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ రేపు భద్రాచలంలో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో పాల్గొనేందుకు రాష్ట్రానికి చెందిన ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, రేణుకా దరి, పోరిక బలరాంనాయక్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు హాజరు కానున్నారు. కాగా ఈ సభను విజయవంతం చేసేందుకు స్థానిక టీఎన్జీవో డివిజన్ అధ్యక్షులు డెక్క నరసింహారావు, కార్యదర్శి గగ్గూరి బాలకృష్ణలు కృషి చేస్తున్నారు. ఐదు గ్రామ పంచాయతీల విలీన అంశాన్ని రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా చేపట్టేందుకు తొలి నుంచి వీరు చేస్తున్న కృషి మరువలేనిది. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటులో వీరు కీలకంగా వ్యవహరించడంతో పాటు టీజేఏసీ ఆధ్వర్యంలో భద్రాద్రిలో 13న సభను విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల వారిని కలుపుకొని వెళ్తూ సభ విజయవంతానికి కృషి చేస్తున్నారు. భద్రాచలం డివిజన్‌లో టీఎన్జీవో తరఫున పలు సామాజిక కార్యక్రమాలను వీరు నిర్వహిస్తుంటారు.

# అక్రమంగా తరలిస్తున్న 450 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

- నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు
- రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు
- జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్






**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 11, (ప్రజా జ్యోతి)** ధనార్జన ధ్యేయంగా కొంతమంది రేషన్ డీలర్లు బొట్టు చప్పుడుగా అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న సంబంధిత శాఖ అధికారులు వ్యూహాత్మకంగా సుమారు 450 గంటల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు , ఇందుకు సంబంధించిన వివరాలు అదనప కలెక్టర్ వేణుగోపాల్ తెలిపిన ప్రకారం ఈ విధంగా ఉన్నాయి, పేదల పండించే పిడిఎస్ బియ్యం పక్కదారి పడుతుందన్న సమాచారంతో జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించామని ,ఈ సమన్వయ దాడుల్లో మొత్తం 450 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శనివారం తెల్లవారుజామున సుమారు 1 గంట సమయంలో సివిల్ సప్లై అధికారులు, పోలీస్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో భాగంగా ఇల్లెందు మండలం రేపల్లెవాడలోని కోట మైసమ్మ గుడి సమీపంలో అక్రమంగా వాహనాలకు ఎక్కిస్తున్న 200 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు, ఈ సందర్భంగా ఒక లారీ, ఒక బొలెరో వాహనాలను కూడా అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించామన్నారు, అదేవిధంగా టేకులపల్లి మండలంలో మరో ఘటనలో సుమారు 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఇతర రాష్ట్రానికి తరలించే ప్రయత్నంలో ఉన్న లారీని అడ్డుకుని స్వాధీనం చేసుకుందామన్నారు, ఈ బియ్యం ఛత్తీస్ గఢ్ రాష్ట్రానికి మళ్లించేందుకు యత్నించినట్లు ప్రాథమిక విచారణలో బయటపడినట్లు తెలిపారు. ఈ రెండు ఘటనలపై సవివర విచారణ కొనసాగుతోందని, సంబంధిత నిందితులపై తెలంగాణ స్టేట్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (టిపిడిఎస్) కంట్రోల్ ఆర్డర్ నిబంధనలు ,భారతీయ న్యాయ సంహిత కింద కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని అదనపు కలెక్టర్ తెలిపారు . ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని దారి మళ్లించడం తీవ్రమైన నేరమని, ఇందులో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జిల్లాలో ఇలాంటి అక్రమ కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు నిరంతర తనిఖీలు, దాడులు కొనసాగుతాయని తెలిపారు. ఈ దాడుల్లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, సివిల్ సప్లై అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలపై సమాచారం అందించేందుకు ముందుకు రావాలని, సమాచారదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు.